బలగం
BALAGAM
TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 17 ఫిబ్రవరి 2026 www.balagamtv.com పేజీలు 4

## ఫ్యూచర్ సిటీలో 'హెల్త్ సిటీ'

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రత్యేకంగా 'హెల్త్ సిటీ'ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్‌ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో మారుమూల ప్రాంతాలకూ వైద్య సౌకర్యాలను చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం టీ హబ్ లో 'టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'టీఏఎల్ హాస్పిటల్స్ హెల్త్ ఫెస్ట్–2026' ఫైర్‌సైడ్ చాట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పౌరులందరికీ హెల్త్ ప్రొఫైలింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మహిళలకు ముందస్తు క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వివరించారు. రాష్ట్రాన్ని గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా మార్చాలనే సంకల్పంతో ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. ఆరోగ్యరంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు.

# పురపీఠాలపై కాంగ్రెస్ జెండా రెపరెప

- కాంగ్రెస్‌కు 84 మున్సిపాల్టీలు
- బీఆర్ఎస్‌కు 17 మున్సిపాల్టీలు, బీజేపీకి 1 ఇండిపెండెంట్లకు 3
- కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు 5
- కరీంనగర్‌లో బీజేపీ
- కొత్తగూడెంలో సీపీఐ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం చాటింది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో 11 చోట్ల ఎన్నికలు వాయిదా పడగా, మిగిలిన వాటిలో 84 పురపీఠాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పూర్తి మెజార్టీ ఉన్న పట్టణాల్లో ఏకపక్షంగా విజయం సాధించిన కాంగ్రెస్, బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎంఐఎం, ఇండిపెండెంట్లు, ఎక్స్‌అఫీషియో ఓట్ల మద్దతుతో పీఠాలను దక్కించుకుంది. బీఆర్ఎస్ 17 మున్సిపాలిటీలను గెలుచుకోగా, బీజేపీ నారాయణపేట మున్సిపాలిటీతో సరిపెట్టుకుంది.

**జిల్లాల వారీగా కాంగ్రెస్ ఆధిక్యం**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుమలగిరి మినహా అన్ని పురపీఠాలను కాంగ్రెస్ దక్కించుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5 (మరో 2 చోట్ల కూటమి విజయం), ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7కి 7, ఉమ్మడి మెదక్ జిల్లాలో 9, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 7 పురపాలికలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

**17 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా**

బీఆర్ఎస్ గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, జిన్నారం, ఆలంపూర్, అయిజ, మూడుచింతలపల్లి, ఎల్లంపేట, దుబ్బాక, రాయికల్, ఆసిఫాబాద్, తిరుమలగిరి, గజ్వేల్, చేర్యాల, జమ్మికుంట, సిరిసిల్ల, తూఫ్రాన్ మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది.

**బీజేపీకి ఒకటి**

నారాయణపేట మున్సిపాలిటీని బీజేపీ దక్కించుకోగా, వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకుంది.

మొత్తం 36 మున్సిపాల్టీల్లో హంగ్ ఏర్పడగా, 11 చోట్ల ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 25 హంగ్ ఏర్పడిన స్థానాల్లో 15 మున్సిపాల్టీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 5 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్, 4 చోట్ల ఇండిపెండెంట్లు, మరోచోట ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు గెలుచుకున్నాయి. దీనితో కాంగ్రెస్‌పార్టీ గెలిచిన మొత్తం మున్సిపాల్టీల సంఖ్య 84కి చేరింది. బీఆర్ఎస్ సంఖ్య 17కి పెరిగింది.అలాగే 7 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో ఐదింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ కార్పొరేషన్లను దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్లు అదిలాబాద్, జమ్మికుంట, మహబూబాబాద్, భైంసా మున్సిపాల్టీలను గెలుచుకున్నారు. అయితే వీరంతా కాంగ్రెస్ మద్దతుతోనే గెలిచారు. వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై గెలిచిన వారందరూ ఫార్వర్డ్ బ్లాక్ నుంచే గెలిచారని ప్రకటించింది.

మున్సిపాల్టీల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో హస్తం హవా కొనసాగింది. ఇక్కడ 80 శాతానికి పైగా చైర్మెన్ పదవులను ఆ పార్టీ దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. మెదక్ జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాల్టీలో కోరం లేక చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఆ జిల్లాలో మిగిలిన 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 9 స్థానాలను దక్కించుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల మున్సిపాల్టీని ఆ పార్టీ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మున్సిపాల్టీలో ఒక్క స్థానం దక్కిన కాంగ్రెస్‌కు చైర్మెన్ పీఠం దక్కింది. ఇక్కడ మొత్తం 15 వార్డులుండగా.. బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ ఒక్క వార్డులో గెలిచింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిల ఎక్స్ అఫిషియో ఓట్లతో ఆ సంఖ్య మూడుకు చేరింది. వారికి బీజేపీ సభ్యులు మద్దతు పలకడంతో ఒక స్థానంలో గెలిచిన హస్తం అమనగల్‌ను హస్తగతం చేసుకుంది.

**5 కార్పొరేషన్లు కాంగ్రెస్‌కే...**

మున్సిపల్ కార్పొరేషన్లలోనూ హస్తం జోరు కొనసాగింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో 5 చోట్ల మేయర్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా పాతిపల్లి ఎల్లయ్య, మంచిర్యాల మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా సళ్ల రమ్య మహేశ్, మహబూబ్‌నగర్ మేయర్‌గా గుమల్ మమత, డిప్యూటీ మేయర్‌గా ఎం సురేందర్ రెడ్డి, నల్లగొండ మేయర్‌గా బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. నిజామాబాద్, నల్లగొండ డిప్యూటీ మేయరుగా ఎంఐఎంకు చెందిన సల్మాతాహిన్ ఎండీ.అష్రఫ్‌అలీ గెలిచారు. కొత్తగూడెం, నిజామాబాద్, నల్లగొండ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను ఏఐఎంఐఎం గెలుచుకుంది. కొత్తగూడెం మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. ఆ పార్టీ కార్పొరేటర్ మూడ్ గణేశ్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారీకి దక్కింది. చివరి క్షణం వరకు ఉత్కంఠగా సాగిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీ వశమయ్యాయి. ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, వై.సునీల్ రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

**వాయిదా పడిన 11 మున్సిపాలిటీలు**

ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూరు పట్టణాల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.



## ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు శ్రీకారం

- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- స్టార్టప్‌లతో చర్చలు, గ్లోబల్ భాగస్వామ్యాలకు వేదిక

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి మోడీ సోమవారం ఢిల్లీలోని భారత మండపంలో ఇండియా--ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్--2026ను ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో చర్చలు, ఒప్పందాలు, సాంకేతిక ప్రదర్శనలతో సాగనున్న వారాంత కార్యక్రమాలకు ఈ సమ్మిట్ నాంది పలికింది.రిబ్బన్ కట్ చేసిన అనంతరం ప్రధాని విశాలమైన ప్రదర్శన ప్రాంగణాన్ని సందర్శించారు. పలు స్టార్టప్‌ల స్టాళ్ల వద్ద ఆగి వ్యవస్థాపకులతో మాట్లాడారు. ఉత్పత్తులు, వాటి వాస్తవ వినియోగం, నేలమట్ట స్థాయిలో అమలు విధానం వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కొన్ని స్టార్టప్‌ల వద్ద ఎక్కువసేపు గడిపి వాటి సాంకేతిక పరిష్కారాలపై ప్రశ్నలు అడిగారు.

70,000 చదరపు మీటర్లకు పైగా విస్తరించిన ఈ ఎక్స్‌పోలో 600కిపైగా స్టార్టప్‌లు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థలు, పరిశోధనా సంస్థలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అంతర్జాతీయ భాగస్వాములు పాల్గొంటున్నారు. మొత్తం 300కిపైగా ప్రదర్శన స్టాళ్లు, ప్రత్యక్ష డెమోలను "పీపుల్, ప్లానెట్, ప్రోగ్రెస్" అనే ప్రధాన అంశాల చుట్టూ ఏర్పాటు చేశారు.ఆస్ట్రేలియా, జపాన్, ఫ్రాన్స్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ సహా 13 దేశాలు జాతీయ పావిలియన్‌లను ఏర్పాటు చేయడం విశేషం. ఏఐ రంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలపై ప్రపంచ దేశాల ఆసక్తిని ఇది ప్రతిబింబిస్తోంది.

సమ్మిట్ సందర్భంగా పరిశ్రమల మధ్య ఒప్పందాలు, పెట్టుబడుల ప్రకటనలు, సాంకేతిక భాగస్వామ్యాలపై చర్చలు జరిగే అవకాశముందని అధికార వర్గాలు వెల్లడించాయి.

**భారీ స్పందన**

ఈనెల 20వరకు కొనసాగనున్న ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో డెలిగేట్లు తరలివచ్చారు. ఎటు చూసినా టెక్ ప్రియులతో భారత్ మండపం కిటకిటలాడింది. +శీశీస్ర్రీవ, వీఱషతీశీంశీట్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధుల నుంచి కళాశాల విద్యార్థుల వరకు అందరూ పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్న Sundar Pichai, Sam Altman సెషన్లు బుధవారం ప్రారంభం కానున్నాయి. తొలిరోజే ఈ స్థాయి స్పందన రావడం ఏఐ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తోంది.

**గ్లోబల్ ఏఐ కామన్స్ లక్ష్యం**

ఏఐ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా అందుబాటులో ఉండాలని భారత్ స్పష్టం చేసింది. "గ్లోబల్ ఏఐ కామన్స్" పేరుతో ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసి వ్యవసాయం, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో ఏఐ వినియోగాన్ని విస్తరించాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి వెల్లడించారు. త్వరలో "క్రియేట్ ఇన్ ఇండియా మిషన్" ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇది సెమీకండక్టర్ మిషన్ తరహాలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా, ఉపాధి సృష్టి లక్ష్యంగా రూపొందించబడిందని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు తగిన నిపుణులను తయారు చేసి, రాబోయే 25ఏళ్ల వృద్ధికి పునాది వేస్తుందని పేర్కొన్నారు.

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్--2026 భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ దూసుకుపోతుందని, ప్రపంచ అభివృద్ధిలో తన పాత్రను మరింత విస్తరించుకుంటుందని తెలిపారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న తొలి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమ్మిట్ భారత్‌లో జరగడం గర్వకారణమన్నారు. 2023లో యూకేలో జరిగిన సదస్సు 'ఏఐ భద్రత'పై, 2025లో ఫ్రాన్స్‌లో జరిగిన సదస్సు పెట్టుబడులపై దృష్టి సారించగా, ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న ఈ సమ్మిట్ "ఏఐ అందరికీ" అనే నినాదంతో ముందుకు సాగుతోంది.

## 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించు కోవాలని ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె రామకృష్ణారావు ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చిలోగా సమీకరించుకు నేందుకు ప్రణాళికాబద్ధంగా

పని చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎస్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఇతర పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకుని సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య, గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు రూ.15 వేల కోట్లు రావాల్సి ఉందని వివరించారు. వాటిని సమీకరించుకుని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల 2, 3 తేదీల నుంచి జూన్ రెండో తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ శాఖల వారీగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, వైద్యం, విద్య విభాగాల్లో ఈ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక ఉపకరిస్తుందని వివరించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కోరారు. రానున్న క్యాబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను మంగళవారంలోగా సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్ శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు బోనస్ నిధులు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైతులకు వరి బోనస్ బకాయిలకు సంబంధించి నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కోసం రూ.514.36 కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ బోనస్ పంపిణీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2025–26 ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన 2.17లక్షల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ నిధుల విడుదలతోపాటు పౌరసరఫరాల సంస్థ వరి బోనస్ కోసం రూ.1,939.58 కోట్లు విడుదల చేయనుంది. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధర కంటే ఈ రూ.500అదనమనీ, ఈ బకాయిలు చెల్లింపుతో రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం కలుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## 8 మున్సిపాల్టీలకు కాంగ్రెస్ అబ్జర్వర్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగాల్సిన 8 మున్సిపాల్టీలకు కాంగ్రెస్ అబ్జర్వర్లను నియమించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన విడుదల చేశారు. ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు ఎన్.రాజేందర్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు (తొర్రూర్), ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, గండ్ర సత్యనారాయణ (జనగాం), ఎమ్మెల్యేలు బాలు నాయక్, వీర్లపల్లి శంకర్ (ఇబ్రహీంపట్నం), మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ (క్యాథన్‌పల్లి), ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, భూపతి రెడ్డి (ఖానాపూర్), ఎమ్మెల్యేలు పి.రామ్మోహన్ రెడ్డి, గణేష్ (ఇంద్రేశం), సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు (కాగజ్ నగర్), మంత్రి మహ్మద్ అజహరుద్దీన్, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి (జహీరాబాద్) మున్సిపాల్టీలకు అబ్జర్వర్లుగా నియమితులయ్యారు.

## జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదల

- దేశవ్యాప్తంగా 12 మందికి 100 పర్సంటైల్
- ముగ్గురు తెలుగు విద్యార్థుల సత్తా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురుచూసిన జేఈఈ మెయిన్--2026 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. సోమవారం సాయంత్రం అధికారికంగా ఫలితాలు ప్రకటించగా, ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబర్చారు.ఈసారి జేఈఈ మెయిన్ పేపర్--1 ఫలితాల్లో దేశవ్యాప్తంగా మొత్తం 12 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిత్, మోహిత్, తెలంగాణకు చెందిన వివాన్ మహిశ్వరి ఉన్నారు. ముగ్గురు తెలుగు విద్యార్థులు వందకు వంద పర్సంటైల్ సాధించడం విశేషం.

ఈ ఏడాది జేఈఈ మెయిన్ పరీక్షకు మొత్తం 13,55,293 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 13,04,653 మంది పరీక్ష రాశారు. పరీక్షలను జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో దేశవ్యాప్తంగా నిర్వహించారు.

**స్కోర్ కార్డ్ డౌన్‌లోడ్ విధానం**

విద్యార్థులు తమ ఫలితాలను National Testing Agency అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. స్కోర్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఈ దశలను అనుసరించాలి:

ముందుగా జేఈఈ మెయిన్ అధికారిక రిజల్ట్స్ లింక్ ఓపెన్ చేయాలి.

అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్ నమోదు చేయాలి.

క్యాప్చా కోడ్ సరిగా టైప్ చేసి సబ్‌మిట్ చేయాలి.

స్క్రీన్‌పై కనిపించే స్కోర్ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసి భవిష్యత్ అవసరాల కోసం ప్రింట్ తీసుకోవాలి.

విద్యార్థుల ప్రతిభకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తదుపరి దశగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులైన విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు.

## హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి

- 8 పట్టణాలకు సీనియర్ నేతలు ఇన్‌ఛార్జులు
- స్థానిక నేతలు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎనిమిది కీలక పట్టణాలకు సీనియర్ నేతలను ప్రత్యేక ఇన్‌ఛార్జులుగా నియమించారు. అధికార కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియలో అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఎన్నికలు సాఫీగా జరిగేలా పర్యవేక్షణ చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేటీఆర్ ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.

స్థానికంగా అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలపై ఫిర్యాదులు అందాయని పేర్కొంటూ, పార్టీ పూర్తి అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు సీనియర్ నేతలను వెంటనే కేటాయించిన మున్సిపాలిటీలకు పంపినట్లు తెలిపారు.

**నియమిత ఇన్‌ఛార్జులు**

నేడు ఎన్నికలు జరగనున్న 8 హంగ్ మున్సిపాలిటీలలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన అవకాశాలు ఉన్నాయని పార్టీ భావిస్తోంది. ఆయా మున్సిపాలిటీలకు నియమితులైన ఇన్‌ఛార్జులు ఇవే:

తొర్రూర్: ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

జనగామ: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

క్యాతనపల్లి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఖానాపూర్: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇంద్రేశం: ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

కాగజ్ నగర్: మాజీ మంత్రి జోగు రామన్న

జహీరాబాద్: ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి

ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఈ ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా తమ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేరని పార్టీ ధీమా వ్యక్తం చేసింది.

# 5 పంచాయతీలను తెలంగాణలో కలపండి

- తిరుమలలో తెలంగాణ రాష్టానికి 5 ఎకరాల స్థలం కేటాయించండి
- ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించండి
- తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సాగుదాం
- ఖమ్మం పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85% నిధులను విడుదల చేయండి
- సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేయండి
- ఏపీ సీఎం చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి ఖమ్మం జిల్లాకు సంబంధిచిన సాగునీటి వసతులు, భక్తులు మరియు ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేసారు. రాష్ట్ర పునర్విభజనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి వివరించారు. యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషో త్తపట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ చర్య కీలకమని తెలిపారు.అదే విధంగా, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25%) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75%) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి అని తెలిపారు. ప్రాజెక్ట్ శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందని, రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సాగు, జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి ఉన్నందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ రక్షణ గోడలో జరిగిన ఈ నష్టం భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారితీయొచ్చని పేర్కొన్నారు. కరకట్టలోని ఆ భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని మంత్రి తెలిపారు. తక్షణ సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన భూమి గుర్తింపు పూర్తైందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి కోరారు. స్థానిక భక్తుల దీర్ఘకాలిక ఆశయాన్ని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరతను తగ్గించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు.

రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెంపొందిస్తే సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు మరియు మౌలిక వసతుల విస్తరణలో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు పేర్కొన్నారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## బద్ది పోచమ్మ ఆలయంలో ఇంచార్జి కలెక్టర్ పూజలు.

- లడ్డూ ప్రసాదం కౌంటర్ల పరిశీలన



**బలగం టీవీ, వేములవాడ:**

మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలోని బద్దిపోచమ్మ ఆలయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం పూజలు చేశారు. అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేయగా, ఆలయ అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు తీర్థ ప్రసాదాలు అందజేసి.. ఆశీర్వదించారు. అనంతరం ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదం కౌంటర్లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు.

## సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రెండోసారి జిందం కళా చక్రపాణి ప్రమాణ స్వీకారం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్ పర్సన్‌గా జిందం కళా చక్రపాణి వరుసగా రెండోసారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనను మూడో వార్డు ప్రజలు గెలిపించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన చైర్మన్ పదవికి సహకరించిన తోటి 27 మంది కౌన్సిలర్లకు ఆమె అభినందనలు, ధన్యవాదాలు తెలియజేశారు. తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో గతంలో కంటే ఎక్కువగా అభివృద్ధి పనులు చేస్తూ, సిరిసిల్ల పట్టణంలోని 39 వార్డులను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆమె హామీ ఇచ్చారు.

## సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా దార్ల సందీప్ ఎన్నిక..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైనందుకు దార్ల సందీప్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు ఈ పదవి దక్కేలా సహకరించిన 27 మంది తోటి కౌన్సిలర్లకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

**ఎమ్మెల్యే కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు**

ముఖ్యంగా సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తన రాజకీయ ప్రస్థానంలో వెన్నుదన్నుగా నిలిచిన 34వ వార్డు ప్రజలతో పాటు, పట్టణ ప్రజలందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. తొలిసారిగా వైస్ చైర్మన్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సిరిసిల్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని భరోసా ఇచ్చారు. అందరి సహకారంతో పట్టణ సమస్యల పరిష్కారానికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా దారుల సందీప్ స్పష్టం చేశారు.

## వరంగల్ ఎంపీ కడియం కావ్యపై బీఆర్ఎస్ ఫిర్యాదు

**బలగం టీవీ, వరంగల్:**



వరంగల్ ఎంపీ కడియం కావ్య రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నారని, దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ నాయకురాలు లలితా రెడ్డి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

డబుల్ ఓట్లు కడియం కావ్యకు రెండు ఎక్స్-అఫీషియో (జాఇ-శీటటఱఎఱ్) ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్స్-అఫీషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆమె, మళ్ళీ తొర్రూరులో ఎక్స్-అఫీషియో మెంబర్‌గా నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. నియమ ఉల్లంఘన 30 రోజుల ముందే నోటీసు ఇవ్వాల్సి ఉండగా, ఒకటి రెండు రోజుల్లోనే నమోదు చేయించుకుని ఓటు వేయడానికి సిద్ధమవుతున్నారని, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌ను కోరారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కిషోర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, డబ్బులు పంచుతూ దాడులు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇబ్రహీంపట్నం, తొర్రూరులో కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

## సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళా చక్రపాణి..

- వైస్ చైర్మన్‌గా దార్ల సందీప్ ఎన్నిక..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపాలిటీలో కొత్త పాలకవర్గం ఏర్పాటైంది. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళా చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా దార్ల సందీప్ బాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కౌన్సిలర్ల సమక్షంలో ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. కొత్తగా ఎన్నికైన చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.



## వేములవాడలో కాంగ్రెస్ జెండా ఎగిరింది..

- మున్సిపల్ చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ ఎన్నిక



**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పుల్కం రాజు చైర్మన్‌గా, నరాల శేఖర్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఒక్క కౌన్సిలర్ మాత్రమే ఉన్న పరిస్థితి నుంచి నేడు మున్సిపల్ పీఠాన్ని కైవశం చేసుకోవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల్లో గత ప్రభుత్వం చేయని పనులను,తాము రెండేళ్లలో పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లు కోరామని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేములవాడ వెనుకబడిందని, ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని, వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, జిల్లా ఇంచార్జి మంత్రుల సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. వేములవాడ ప్రజలు విజ్ఞులు, అభివృద్ధి కోరుకున్నారని, మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఆనందదాయకమని అన్నారు. ప్రజల కోసం, ప్రాంతం కోసం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని, ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలబడతామని అన్నారు.

## యూకేలో సేవాలాల్ మహారాజ్ జయంతి

- నివాళులర్పించిన బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం..

**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే విభాగం ఆధ్వర్యంలో బంజారా ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజారా బిడ్డ తరుణ్ లూనావత్ ప్రసంగిస్తూ, సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజ అభ్యున్నతి కోసం చేసిన కృషి, పోరాటాలు, సామాజిక చైతన్యానికి చేసిన సేవలను వివరిస్తూ చెప్పారు. సమాజంలో సమానత్వం, ధార్మికత, సేవాభావం వంటి విలువలను ఆయన బోధించిన తీరు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన బీఆర్ఎస్ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే అధ్యక్షులు ప్రసంగిస్తూ, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమాజంలోని ప్రతి వర్గాన్నీ సమానంగా చూడటం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, ముఖ్యంగా బంజారా సమాజానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. నేడు బీఆర్ఎస్ కార్యాలయంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించడం గర్వకారణమని ఆయన అన్నారు. ఈ వేడుక బంజారా సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షులు హరి గౌడ్ నవాపేట్, సత్యమూర్తి చిలుముల, రవి కుమార్ రేటినేని, మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, కార్యదర్శి -- ఐటీ, మీడియా ఢ పీఆర్ రవి ప్రదీప్ పులుసు, ముఖ్య సభ్యులు అబ్దుల్ ఖుదూస్, ఇమ్రాన్, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## విధేయతకే పట్టం..
## సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా జిందం కళాచక్రపాణి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. సిరిసిల్ల 3వ వార్డు కౌన్సిలర్ జిందం కళాచక్రపాణి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రెండోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ విధేయత, కృషి, నాయకత్వ లక్షణాలకు గుర్తింపుగా ఈ అవకాశం లభించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్న జిందం కళాచక్రపాణి, కల్వకుంట్ల తారక రామారావుకు అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచారు. పార్టీ అంతర్గతంగా విస్తృత చర్చల అనంతరం జిందం కళను చైర్‌పర్సన్‌గా నియమించాలని కేటీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే హైదరాబాద్ క్యాంప్ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మరికొద్ది సేపట్లో సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు. అధికారిక ప్రకటన అనంతరం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండోసారి చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టనున్న జిందం కళాచక్రపాణి నాయకత్వంలో సిరిసిల్ల పట్టణాభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి

# రాజన్నకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు
- వేములవాడ ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చర్యలు వేగవంతం చేశాం : మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, వేములవాడ:**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా సతీసమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు మహాశివరాత్రి సందర్భంగా భీమేశ్వర ఆలయంలో కూడా మంత్రి పొన్నం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దక్షిణ కాశిగా ఖ్యాతిగాంచిన వేములవాడ ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో చర్యలు వేగవంతం చేశామని మంత్రి తెలిపారు. ప్రార్థన రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రూ. 150 కోట్ల అభివృద్ధి వేములవాడ రాజన్న ఆలయాన్ని సుమారు రూ. 150 కోట్ల వ్యయంతో 4 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.

# వేములవాడలో ఇంచార్జి కలెక్టర్ పర్యటన..

- భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల పరిశీలన...

**బలగం టీవీ, వేములవాడ:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారిని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆది వారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్య శిబిరం అండ్ హెల్ప్ డెస్క్ ఆలయ ఆవరణలోని వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, అక్కడ అందుబాటులో ఉన్న మందుల గురించి ఆరా తీశారు. అలాగే 'మే ఐ హెల్ప్ యూ' డెస్క్ సిబ్బందితో మాట్లాడి సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులతో ఆత్మీయ సంభాషణ క్యూ లైన్ల వద్ద ఉన్న భక్తులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవలపై స్పందన తెలుసుకున్నారు. ఈ క్రమంలో వాలంటీర్లు భక్తులకు నీటిని పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూం బీమేశ్వర సదన్‌లోని కమాండ్ కంట్రోల్ రూంను



కలెక్టర్‌తో పాటు ఎస్పీ మహేష్ బి గితే సందర్శించారు. జాతర పర్యవేక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీ వోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జాతర ఏర్పాట్లు భేష్



**బలగం టీవీ, వేములవాడ:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిసరాల్లోని భక్తుల మధ్యకు వెళ్లిన ఆమె, ఏర్పాట్లపై వారి స్పందనను నేరుగా తెలుసుకున్నారు. సౌకర్యాల ఆరా దర్శనానికి వచ్చిన భక్తులతో ఆప్యాయంగా సంభాషిస్తూ.. పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, క్యూ లైన్లలో సౌకర్యాలు ఎలా ఉన్నాయో ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజా స్పందన జాతర ఏర్పాట్లు చాలా బాగున్నాయని, యంత్రాంగం కల్పించిన సౌకర్యాలపై సంతృప్తిగా ఉన్నామని భక్తులు కలెక్టర్‌కు తెలిపారు. అధికారుల పరిశీలన మహిళలతో ఆత్మీయంగా ముచ్చటించిన ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మరియు ఇతర అధికారులతో కలిసి క్యూ లైన్లలో చేపట్టిన చర్యలను పరిశీలించారు.

# జాతర రద్దీలో తప్పిపోయిన వారికి పోలీసుల సహాయం..

- కుటుంబాలకు సురక్షితంగా చేరవేత.

**బలగం టీవీ, వేములవాడ:**

మహా శివరాత్రి జాతర సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ మధ్య తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను పోలీసులు అప్రమత్తంగా గుర్తించి, వారికి తగిన సంరక్షణ కల్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగిస్తున్నారు. సేవాభావంతో, బాధ్యతతో పనిచేస్తున్న పోలీస్ యంత్రాంగం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. జాతర ప్రాంగణంలో ప్రత్యేక సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, తప్పిపోయిన వారి వివరాలను నమోదు చేసి, మైక్ ప్రకటనలు మరియు ఇతర సాంకేతిక వనరుల ద్వారా కుటుంబ సభ్యులను త్వరితగతిన గుర్తించే చర్యలు చేపడుతున్నారు. భయాందోళనకు గురయ్యే పిల్లలు, వృద్ధులతో పోలీస్ సిబ్బంది సానుభూతిగా మాట్లాడి ధైర్యం చెప్పడంతో పాటు, అవసరమైన







ప్రాథమిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఇప్పటివరకు పలువురు పిల్లలు, వృద్ధులను సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది. జాతరలో భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. భక్తులు తమ పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా వెంటనే సమీప పోలీస్ సిబ్బందిని లేదా సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. జాతరలో భక్తుల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం సేవలు అందిస్తున్నారు.



# వేములవాడ జాతరలో 24 గంటలూ అందుబాటులో 'మే ఐ హెల్ప్ యూ' కేంద్రాలు...




**బలగం టీవీ, వేములవాడ:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమాచారం అందించేందుకు, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు వేములవాడలో ఏడు చోట్ల 'మే ఐ హెల్ప్ యూ' సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సహాయ కేంద్రాల వివరాలు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు 24 గంటలూ భక్తులకు సేవలు అందిస్తాయని అధికారులు తెలిపారు. అవి ఉన్న ప్రాంతాలు.

తిప్పాపూర్ మెయిన్ బస్ స్టేషన్
తిప్పాపూర్ బ్రిడ్జి అవతల కాలినడక దారి
జగిత్యాల తాత్కాలిక బస్ స్టేషన్ వద్ద
కోరుట్ల బస్ స్టేషన్ (జూనియర్ కళాశాల సర్కిల్)
శివార్చన స్టేజి -- పార్కింగ్ ప్రాంతం
బద్ది పోచమ్మ ఆలయం దగ్గర
భీమేశ్వర సదన్ వద్ద

మంచినీరు భక్తుల కోసం ప్రత్యేకంగా రెండు మంచినీటి సరఫరా డెస్కులను కూడా ఏర్పాటు చేశారు. బేబీ ఫీడింగ్ క్యాబిన్ చంటి పిల్లలకు పాలు ఇచ్చే తల్లుల సౌకర్యార్థం కళ్యాణకట్ట సమీపంలో ప్రత్యేక బేబీ ఫీడింగ్ క్యాబిన్‌ను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ ఈ కేంద్రాలను జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఆదివారం స్వయంగా పరిశీలించారు.




# వేములవాడ జాతరలో భక్తుల కోసం 24 గంటల వైద్య సేవలు, 15 చోట్ల ప్రత్యేక శిబిరాలు...

**బలగం టీవీ, వేములవాడ:**

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 255 మంది సిబ్బందితో ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు.

వైద్య శిబిరాల వివరాలు పట్టణంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు బస్టాండ్ల వద్ద కూడా శిబిరాలను ఏర్పాటు చేశారు: ఆలయ పరిసరాలు భీమేశ్వర స్వామి ఆలయ అంతర్భాగం, లడ్డూ కౌంటర్ సమీపం, కల్యాణ కట్ట, శివార్చనం ప్రాంగణం, అమ్మవారి అతిథి గృహం, భీమేశ్వర సదన్. పట్టణ కేంద్రాలు వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి, బస్తీ దవాఖాన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.బస్టాండ్లు డ పరిసరాలు కోరుట్ల బస్టాండ్, జగిత్యాల బస్టాండ్, తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్, అగ్రహారం ఆలయం, నాంపల్లి ఆలయం, సంస్కృత కళాశాల.

అత్యవసర బృందాలు తక్షణ సహాయం కోసం రెస్క్యూ టీమ్‌లు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, యాంటీ లార్వా డ ఫాగింగ్ బృందాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. భక్తులు వైద్య అవసరాల కోసం సమీపంలోని శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- తలసాని శ్రీనివాస్ యాదవ్...




**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 17న జరగనున్న కేసీఆర్ జన్మదిన వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. కేసీఆర్ పాలన పదేళ్ల పాటు సీఎంగా కేసీఆర్ తెలంగాణను అద్భుతంగా పరిపాలించారని తలసాని కొనియాడారు. మున్సిపల్ ఎన్నికలపై వ్యాఖ్యలు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 15 లక్షల ఓట్లు వస్తే, బీఆర్ఎస్ పార్టీకి 10 లక్షల ఓట్లు వచ్చాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సోయిలో లేదని విమర్శించారు. కార్యకర్తలకు పిలుపు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించారని ఆయన కొనియాడారు. ఈ ప్రెస్ మీట్‌లో పల్లె రవికుమార్, కె. కిషోర్ గౌడ్, ముఠా జయసింహ పాల్గొన్నారు.

# ఇంగ్లాండ్‌ను వణికించిన ఇటలీ

- 24 పరుగుల తేడాతో ఓడిన ఇటలీ
- సూపర్ 8కు ఇంగ్లాండ్ జట్టు

బలగం టీవీ, హైదరాబాద్




టీ20 వరల్డ్‌కప్‌లో ఇంగ్లాండ్ మూడో విజయం నమోదు చేసి సూపర్ 8కు దూసుకెళ్లింది. గ్రూప్ దశలో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్?లో 24 పరుగుల తేడాతో నెగ్గింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 203 పరుగుల టార్గెట్?ను ఇటలీ ఓవర్లన్నీ ఆడి 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బెన్ మనెంటి (60 పరుగులు, 25 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్ వృథా అయ్యింది. ఇంగ్లాండ్ బౌలర్లలో శామ్ కరన్, జెమీ ఓవర్టన్ చెరో 3, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53 పరుగులు, 22 బంతుల్లో) మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. టామ్ బంటన్ (30 పరుగులు), ఫిల్ సాల్ట్ (28 పరుగులు), శామ్ కరన్ (25 పరుగులు), జాకబ్ బెతెల్ (23 పరుగులు) ఆకట్టుకున్నారు. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవార్ట్, క్రిషన్ కలుగమానే చెరో 2, జేజే స్మట్స్, అలీ హసన్, బెన్ మనెంటి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ టోర్నీలో రెండో ఓటమితో గ్రూప్ సీ నుంచి ఇటలీ సూపర్ 8 రేసు నుంచి నిష్క్రమించింది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్‌లు ఆడగా, ఇటలీ ఒక మ్యాచ్?(నేపాల్‌తో)లోనే నెగ్గింది. ఇక లీగ్ స్టేజ్?లో చివరిదైన నాలుగో మ్యాచ్ ఫిబ్రవరి 19న వెస్టిండీస్‌తో జరగనుంది. ఈ గ్రూప్‌లో ఇప్పటికే వెస్టిండీస్ సూపర్ 8కు అర్హత సాధించింది.

# ఎట్టకేలకు బోణీ కొట్టిన అఫ్గానిస్థాన్




బలగం టీవీ, హైదరాబాద్

టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో తొలి రెండు మ్యాచ్?లో ఓటమిపాలైన అఫ్గాన్, తాజాగా యూఏఈపై ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 161 పరుగుల టార్గెట్‌ను 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇబ్రహీం జర్దాన్ (53 పరుగులు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (40లి పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో జునైద్ సిద్ధిఖీ 2, మహ్మద్ అర్ఫాన్ చెరో 2, మహ్మద్ జువాదుల్లా 1 వికెట్ దక్కించుకున్నారు.తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (68 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించగా, అలిశన్ షరపు (40 పరుగులు) ఆకట్టుకున్నాడు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 4, ముజీబ్ అర్ రెహ్మాన్ 2, రషీద్ ఖాన్ 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్?లో అఫ్గాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్?లో అర్ఫాన్ వికెట్ తీయడంతో టీ20ల్లో 700 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్?గా నిలిచాడు. మొత్తం 513 టీ20ల్లో ఈ ఫీట్ అందుకున్నాడు. ఇందులో ఆయా దేశాల లీగులు, అంతర్జాతీయ టీ20 క్రికెట్?లో కలిపి ఈ వికెట్లు సాధించాడు. టీ20 క్రికెట్?లో 700 వికెట్ల మైలురాయి అందుకున్న ఏకైక బౌలర్?గా రషీద్ నిలిచాడు. ఇందులో అంతర్జాతీయ టీ20ల్లో 191 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు తీసిన అఫ్గాన్ బౌలర్?గానూ రషీద్ టాప్?లో కొనసాగుతున్నాడు. అటు ఐపీఎల్?లో అతడు 114 మ్యాచ్?ల్లో 158 వికెట్లు కూల్చాడు. ఇక ఓవరాల్?గా రషీద్ తర్వాత ఈ లిస్ట్?లో వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. అదే దేశానికి చెందిన సునీల్ నరైన్ 613 వికెట్లతో ఈ లిస్ట్?లో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. టీ20 వరల్డ్?కప్? హిస్టరీలో 140ం పరుగుల ఛేదనలో అఫ్గాన్?కు ఘనమైన రికార్డేమీ లేదు. ఇప్పటిదాకా 15సార్లు 140ం పరుగుల ఛేదనలో దిగిన అఫ్గాన్, ఈ మ్యాచ్?సహా విజయం సాధించింది కేవలం నాలుగు మ్యాచ్?ల్లోనే. అత్యధికంగా 10సార్లు ఓడింది. ఈ టోర్నీలోనే సౌతాఫ్రికాతో మ్యాచ్ టై అయ్యింది. ఇక ప్రస్తుత టోర్నమెంట్?లో గ్రూప్ డీలో ఉన్న అఫ్గాన్ తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను ఢీ కొట్టింది. ఆ మ్యాచ్?లో 5 వికెట్ల తేడాతో ఓడింది. తర్వాత సౌతాఫ్రికాతో మ్యాచ్?లో గెలుపు అంచులదాకా వెళ్లి బోల్తా కొట్టింది. ఆ మ్యాచ్? డ్రా అవ్వడంతో సూపర్ ఓవర్?కు వెళ్లింది. అయితే సూపర్ ఓవర్ కూడా డ్రా అవ్వడంతో రెండోసారి సూపర్ ఓవర్ నిర్వహించాల్సి వచ్చింది. ఇక రెండో సూపర్ ఓవర్?లో 5 పరుగుల తేడాతో సౌతాఫ్రికా నెగ్గింది. దీంతో అఫ్గాన్?కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. టోర్నీలో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన పరిస్థితిలో యూఏఈపై విజయం సాధించి సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ దశలో అఫ్గాన్ తమ ఆఖరి మ్యాచ్?లో కెనడాను ఢీ కొట్టాల్సి ఉంది.

# పాక్ ఓటమిని శాసించింది వీరే..

బలగం టీవీ, హైదరాబాద్

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు పాకిస్థాన్‌పై మరో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దాంతో సూపర్-8లో తన స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకుంది. ఎంతో ఉత్కంఠ రేపుతుందని ఆశించిన ఫ్యాన్స్ కు నిరాశ కలిగిస్తూ ఏకపక్షంగా సాగిన మ్యాచులో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరిగిన పోరులో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమ్ ఇండియా అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లో అద్భుత ప్రదర్శన చేసింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 175 పరుగులు బోర్డుపై ఉంచింది. టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఆరంభంలోనే షాక్ తగిలినప్పటికీ, ఆ తర్వాత మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ తన ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇషాన్ వేగంగా పరుగులు రాబడుతూ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. స్టేడియం నలుమూలలా షాట్లు ఆడుతూ పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్ అయ్యాడు. తన పరుగులతో భారత విజయంలో కీలక పాత్ర పోషించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కించుకున్నాడు. ఇషాన్ కిషన్ అవుట్ అయిన తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. మిడిల్ ఓవర్లలో ఆచితూచి బ్యాటింగ్ చేస్తూ తిలక్ వర్మతో కలిసి భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 170 దాటించడంలో కీలకపాత్ర పోషించాడు. . సూర్య 29 బంతుల్లో 32 పరుగులు చేయగా.. చివర్లో ఆల్ రౌండర్ శివమ్ దూబె 158.82 స్ట్రైక్ రేట్‌తో 27 పరుగులు చేశాడు. దాంతో భారత్ ఈ పిచ్ మీద పాక్‌కు భారీ టార్గెట్ ఇవ్వగలిగారు. 175 పరుగుల టార్గెట్ కాపాడుకునే క్రమంలో బరిలోకి దిగిన భారత జట్టుకు బౌలర్లు అద్భుత ఆరంభాన్ని ఇచ్చారు. హార్దిక్ పాండ్యా తన మొదటి ఓవర్లోనే పాకిస్థాన్ ఓపెనర్‌ను అవుట్ చేసి తొలి దెబ్బ కొట్టాడు. 3 ఓవర్లలో కేవలం 16 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. తన బౌలింగ్ లో పాక్ బ్యాటర్లకు స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వలేదు. పాక్ స్పిన్నర్లతో ఇబ్బంది పెడితే భారత్ మాత్రం పేసర్లు, స్పిన్నర్లతో పాక్ ను కట్టడి చేసింది.భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తన స్పెల్‌లో సయీమ్ అయూబ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా వికెట్లు తీసి పాకిస్థాన్ బ్యాటింగ్‌ను బ్యాక్‌ఫుట్‌లోకి నెట్టాడు. బుమ్రా బౌలింగ్ తో పాక్ బ్యాటర్లు పరుగులు చేయడానికి ఇబ్బంది పడ్డారు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్ అక్షర్ పటేల్ రాణించాడు. పాకిస్థాన్ కీలక బ్యాటర్లను అవుట్ చేసి మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించేలా చేశాడు. వీరికి తోడు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీశాడు. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో భారత్ తన గ్రూపులో అగ్రస్థానాన్ని నిలుపుకుంది. టీ20 వరల్డ్ కప్‌లో పాక్ పై భారత్ ఆధిక్యం 8-1కి పెరిగింది. భారత్ నెక్ట్స్ మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది.




# కువైట్‌లో ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు..

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కువైట్ అధ్యక్షురాలు అభిలాష గొడిశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో రక్తదానం నిర్వహించి అనంతరం కేక్ కట్ చేసి ప్రతి ఒక్కరు కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలిగి మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవ చేయాలని, తెలంగాణ రాష్ట్ర సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు కేసీఆర్ అందించిన నాయకత్వం చారిత్రాత్మకమని కొనియాడారు. త్వరలోనే మళ్లీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చూడాలని, రాష్ట్ర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తున్నామని అధ్యక్షురాలు అభిలాష తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిలాష గొడిశాల, సురేష్ గౌడ్, ప్రమోద్, అయ్యప్ప, జగదీశ్, వసంత్, నరేందర్, జమీల్, రవి, నౌషి, రామ్‌చరణ్, హిమాన్షు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, వేములవాడ:

మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణంతోపాటు జాతర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కాగా పూర్తి చేయించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడలోని శివార్చన స్టేజీ, ఇతర పరిసర ప్రాంతాల్లో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా.. ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. చెత్త తరలించే ట్రాక్టర్, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, నీటిని సరఫరా చేయాలని సూచించారు.

**కమాండ్ కంట్రోల్ రూంలో పరిశీలన**



భీమేశ్వర సదన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. శ్రీ భీమేశ్వరస్వామి, బద్ది పోచమ్మ, ప్రసాదం కౌంటర్లు ఇతర ప్రదేశాల్లో భక్తుల రద్దీని పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో డీఆర్డీఓ గీత, మిషన్ భగీరథ ఈఈ అన్వర్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో విద్యార్థులకు క్యాలెండర్ల పంపిణీ.. సమస్యలపై అవగాహన...

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాలెండర్లు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థినులకు, విద్యార్థులకు కేసీఆర్ చిత్రపటంతో ఉన్న క్యాలెండర్లను నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి, ఉన్నత విద్య గురించి బీఆర్ఎస్వీ నాయకులు అవగాహన కల్పించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న నాయకులు, వాటిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్వీ నాయకులు సయ్యద్ జుబేర్, రాకేష్, పూర్ణ, అయ్యాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో నేడు ఘనంగా కేసీఆర్ జన్మదినం

- 72 కిలోల కేక్‌తో వేడుకలు : తలసాని సాయి కిరణ్ యాదవ్...

బలగం టీవీ, హైదరాబాద్:



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నేత తలసాని సాయి కిరణ్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కేసీఆర్ 72వ జన్మదినం సందర్భంగా 72 కిలోల కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుంది. ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరవుతారు. జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలను బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టనున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో పరిస్థితులు అధ్వాన్నంగా మారాయని, ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తుందని సాయి కిరణ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇదే చివరి ముఖ్యమంత్రి పదవి అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కిషోర్ గౌడ్, లక్ష్మణ్ మురిశెట్టి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.